# బెంగ

మినీకథ

పడాల రాములు

"ఈ దెబ్బతో సుబ్బారావు పని అయిపోతుంది" రావు అన్నాడు స్నేహితులతో.

"అయినా ఇలా లాస్ట్ మినిట్ దాకా సుబ్బారావు ఎందుకు ఊరుకున్నట్టు?" శర్మ సందేహం వెలిబుచ్చాడు.

"సుబ్బారావుకి అసలు బుద్ధి లేదరా! మరీ దేశంమీద పడి అలా అప్పులు చేసేయడమే! ముందుచూపు ఉండక్కర్లే!" మూర్తి మందలింపుగా అన్నాడు.

"ఏమోలే! ఎవరు చెప్పొచ్చారు. ఈ పాటికి ఏదో ప్లాన్ వేసే ఉంటాడు"—రెడ్డి అన్నాడు,

వీళ్ళందరూ సుబ్బారావు స్నేహితులే! సుబ్బారావుకి ఊరినిండా అప్పులున్నాయని తెలుసు.

అయితే అప్పులు అంత అర్జంటుగా తీర్చే అవసరం ఏమొచ్చిందా అని అడగొచ్చు. కరెక్ట్ - ఆ అవసరం నెత్తిమీదికొచ్చి కూర్చుంది.

సుబ్బారావు నెత్తిమీద ప్రస్తుతం అప్పుల రాక్షసి ఉంది. ఆ రాక్షసి బారినుంచి అతన్ని ఎలా తప్పించాలో అర్థం కావడంలేదు స్నేహితులకి!

సుబ్బారావుకి కాబూలీవాడు నోటీసిచ్చాడు. తన మూడు వేల అప్పు మూడ్రోజుల్లో తీర్చమని. లేకపోతే ఇల్లు తాకట్టు పెట్టుకుంటానని. ఇల్లు తాకట్టు పెడితే, వాడు భార్యాపిల్లలతో రోడ్డుమీద ఉండాల్సిందే!

పరిస్థితి ఇలా వుండగా రెండ్రోజుల్నించీ సుబ్బారావు కనబడటంలేదు. స్నేహితులు కంగారు పడిపోసాగారు పాపం! సుబ్బారావు అప్పుకోసం ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో! ఎన్ని తిప్పలు పడుతున్నాడో! తిండీ తిప్పలు సరిగా ఉంటున్నాయో లేదో! ఇంక నిద్ర మాత్రం ఎలా పడుతుంది?—అని ఆందోళన పడుతున్నారు.

ఇంతలో సుబ్బారావు సడెన్‌గా సైకిలేసుకుని వాళ్ళ ముందు వాలాడు.

"ఏం గురువులూ! ఎలా ఉన్నారు?" అన్నాడు హుషారుగా ఈలవేస్తూ.

మిత్రబృందం పిసుకోయింది.

వాడి మొహంలో ఏ కోశానా బాధ అనేది కనబట్టం లేదు. వాడేదో నిద్రాహారాలు మానేసి, నీరసంగా ఉంటాడనుకున్న వాళ్ళు వాడంత హుషారుగా ఉండటం చూసి ఆశ్చర్యపోయారు.

"ఏం గురు ! సరిగా నిద్ర పోతున్నావా?" అడిగాడు శర్మ

"బ్రహ్మాండంగా!"

"అన్నం తింటున్నావా?"—రావు.

"శుభ్రంగా!"

"అది కాదురా! నీకసలు నిద్ర ఎలా పడుతోందిరా?"

"ఏం?"

"అన్నమెలా సయిస్తోందిరా?"

"ఎందుకు సయించదూ?"

"అదేమిట్రా అలా అడుగుతునావు? కాబూలీవాడి అప్పు తీర్చాల్సింది రేపే కదరా!"

"అయితే?"

"ఇల్లు తాకట్టు పెట్టుకుంటానన్నాడుగా. ఏం చేస్తావు?"

"వోహ్! అదట్రా మీ బెంగ! కాబూలీవాడు నన్నేమీ చేయలేడు."

"ఎందుకని?"

"నన్నేదన్నా చేస్తే నష్టపోయేది వాడే! వాడి అప్పు తీరదు. అందుకని — ఏదైనా దిగులుంటే వాడికుండాలి. నాకెందుకు? నిద్రాహారాలు మానేసి ఇచ్చిన అప్పు ఎలా రాబట్టుకోవాలా అని ఆలోచించాల్సింది వాడు నాకేం! నిక్షేపంలా ఉన్నాను" అన్నాడు సుబ్బారావు శర్మ భుజం చరుస్తూ.

"హోరి! వీడి ధైర్యం తగలెయ్య!" అని స్వీట్‌గా తిట్టుకున్నారు, స్నేహితులు సుబ్బారావుని.

రెండ్రోజుల తరువాత—

ఓ ఫైన్ మార్నింగ్ ఊరంతటా ఓ వార్త అగ్గిలా పాకింది.

"కాబూలీవాడు చచ్చిపోయాడు." ✻

# ప్రేమసింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

31 సీరియల్

నాగమ్మ ఇల్లు పెద్దదిగానే వుంది. అది ముందు ఒకయిల్లు వెనక ఒకయిల్లుగా వుంది. మధ్యలో నున్న వరండా యీ రెండు యిళ్ళనీ కలుపుతోంది. ముందు యింట్లో హాలులో బల్లల మీద వేరుశనగకాయ బస్తాలు వేసి వున్నాయి. పలుపులు, తాళ్ళు దానా బుట్టలు, నీళ్ళుతోడుకునే బకెట్ మొదలయినవివున్నాయి. వెనక వైపు వున్న యింట్లో వంట గది గాక వేరే రెండు గదులు వున్నాయి. ఒక గదిలో రెండు మంచాలు వున్నాయి. పిల్లలంతా క్రిందనే పడుకుంటారుట.

నాగమ్మని చూడగానే, పాలేరు పరుగెత్తుకువచ్చి నాగమ్మ చేతిలో సంచీ తీసుకున్నాడు.

"అదుగో ఆ మూటలో, కొత్త చాంతాడు, కొత్త పలుపూ వున్నాయి." అంది.

"ఎప్పుడు బైలుదేరావే!" నడుం వంగిన ఒక ముసలామె వచ్చింది.

"ఎప్పుడు బైలుదేరతాను. రాత్రి ఎనిమిది గంటలకి! మనవూరి రైలు ఎప్పుడు వస్తుందేమిటి!" అంది నాగమ్మ విసుగ్గా.

నాగమ్మయింట్లో అడుగు పెట్టూనే చెంగుదోపి పనిలోకి దిగింది.

"ఈ అమ్మాయి ఎవరే నాగూ!" కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకుని చూస్తూ అడిగింది రాజమ్మ.